బాల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

సిటీబ్యూరో, మే 28 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లా పరిధిలో ధైర్యసాహసాలు ప్రదర్శించిన పిల్లలతో పాటు క్రీడలు, కళలు, సంస్కృతి, సామాజిక రంగాలలో గుర్తింపు పొందిన బాలబాలికలకు ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అందజేయడం జరుగుతుందని జిల్లా సంక్షేమ శాఖ అధికారి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం పిల్లలు జాతీయ అవార్డు www.awards.gov.in వెబ్‌సైట్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గురువారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని బాలబాలికలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అచ్యుత సమంతకు గౌరవ డాక్టరేట్

సిటీబ్యూరో, మే 28(నమస్తే తెలంగాణ): ప్రముఖ సామాజికవేత్త, విద్యావేత్త, కిట్ అండ్ కిస్ సంస్థ వ్యవస్థాపకులు డా.అచ్యుత సమంతకు అరుణాచల్‌ప్రదేశ్‌లోని హిమాలయన్ యూనివర్సిటీ బుధవారం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర మంత్రి పసంగ్ డోర్జి సోనా, యూనివర్సిటీ చైర్మన్ హేమంత్ గోయల్, వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొ.ప్రకాశ్ దివాకరన్ చేతుల మీదుగా అచ్యుత సమంత ఈ డాక్టరేట్‌ను అందుకున్నారు.

టెండర్లకే పరిమితం!

- ప్రశ్నార్థకంగా మీరాలం కేబుల్ బ్రిడ్జి నిర్మాణం
- సాక్షాత్తు సీఎం ప్రకటించినా తట్టెడు మట్టి ఎత్తిపోయని వైనం
- ఏజెన్సీకి పనులు అప్పగించకుండానే ఆగిన ప్రాజెక్టు
- సమీక్షా సమావేశాల్లో హెచ్ఎండీఏకు ఆహ్వానం లేకపోవడంతో గందరగోళం

కాంగ్రెస్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టే ప్రాజెక్టులన్నీ కేవలం ప్రకటనలకే పరిమితం అవుతున్నాయి. అట్టహాసంగా మీరాలం చెరువు మీద కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తామని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేస్తే... ఇప్పటికీ ఆ ప్రాజెక్టులో తట్టెడు మట్టి తీయలేదు. ఆరు నెలల కిందట అధ్యయనం చేస్తామంటూ ట్రాన్సాక్షనల్ అడ్వైజరీకి హెచ్ఎండీఏ నోటిఫికేషన్ జారీ చేయగా... ఇప్పటికీ అతీగతి లేకుండా పోయింది. కనీసం ఆ ఏజెన్సీ ఇప్పటికీ ఏం చేసిందనేది కూడా తెలియడం లేదు. ముఖ్యంగా ప్రభుత్వం ప్రకటించుకున్న కీలకమైన ప్రాజెక్టుల విషయంలోనూ ఈ తరహా జాప్యం జరిగితే... ఇక పెండింగ్‌లో ఉన్న పనుల పరిస్థితి ఏంటని ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.

మీరాలం చెరువు కేబుల్ బ్రిడ్జ్ ఊహా చిత్రం

సిటీబ్యూరో, మే 28 (నమస్తే తెలంగాణ): మీరాలం చెరువును పర్యాటక ప్రాంతంగా, బెంగుళూరు హైవేకు రవాణా సదుపాయాలను మెరుగుపరిచేలా ఆధునీకరించాలని అప్పటి కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మీరాలం బ్యూటిఫికేషన్‌పై అప్పట్లోనే కార్యాచరణ రూపొందించారు. ప్రాజెక్టుకు సంబంధించిన అంచనా, ప్రాజెక్టు విధివిధానాలు, డీపీఆర్ రూపకల్పనపై హెచ్ఎండీఏ కసరత్తు చేసి ప్రభుత్వానికి అందజేసింది. అయితే తదనంతరం అధికారంలోకి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. మీరాలం చెరువుపై నిర్మించే కేబుల్ బ్రిడ్జి నిర్మాణాన్ని గందరగోళంలో పడేసింది. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరకు పైగా గడుస్తున్నా కనీసం ఇప్పటికీ డీపీఆర్ కూడా ఖరారు కాలేదు.

హెచ్ఎండీఏ ప్రమేయం లేకుండానే..

వాస్తవానికి మీరాలం చెరువు అభివృద్ధికి చేపట్టాల్సిన నమూనాలను తీర్చిదిద్దేందుకు ఓ కన్సల్టెన్సీని హెచ్ఎండీఏ నియమించింది. ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్ తయారు చేసి, పబ్లిక్-ప్రైవేట్ ప్రాజెక్టుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన సమగ్రమైన విధివిధానాలను రూపొందించే పనులు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించింది. ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన ఖర్చు, ట్రాఫిక్ రద్దీ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ఏజెన్సీకి డీపీఆర్ సిద్ధం చేసే బాధ్యతలను అప్పగించేలా టెండర్లను పిలిచింది. కానీ ఆ తర్వాత జరిగిన సమీక్ష సమావేశాలనుహెచ్ఎండీఏ ప్రమేయం లేకుండా నిర్వహించడంతో అసలు గందరగోళం మొదలైంది. సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి.. హెచ్ఎండీఏ కమిషనర్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు లేకుండా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అయితే అదే మీటింగ్‌లో ఎంఆర్‌డీసీఎల్, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొనడంతో అసలు గందరగోళానికి కారణమైంది. బెంగుళూరు హైవే మార్గాన్ని మరింత విస్తరించేలా ఆరు లైన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. బెంగుళూరు హైవే నుంచి చింతల్ మెంట్ మీదుగా అత్తాపూర్ వరకు 2.65 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాజెక్టుఅందుబాటులోకి వస్తే, ఆ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ, రవాణా దూరం తగ్గిపోవడంతోపాటు మీరాలం చెరువు పర్యాటక ప్రాంతంగా మారనుంది. దీనికి వీలుగా ప్రాజెక్టు డిజైన్ ఉండాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. దీనిపై వ్యూ డెక్, స్కై వాక్‌తోపాటు నెహ్రూ జువాలజికల్ పార్క్‌ను చేరుకునేలా డిజైన్ చేశారు. మీరాలం ట్యాంక్ ఆధునీకరణలో భాగంగా సైకిల్ ట్రాక్, పెడిస్ట్రీయన్ ట్రాక్ కూడా అందుబాటులోకి రానుంది. మీరాలం వెంబడి పర్యాటక రంగానికి మరింత అవకాశం ఏర్పడుతుందని జూ పార్క్ సందర్శనకు వచ్చేవారికి అనువుగా ప్రాజెక్టు ఉండాలని ప్రణాళికలను గతంలోనే అధికారులు సిద్ధం చేశారు. కానీ ప్రకటనలకే పరిమితమవుతున్న కాంగ్రెస్ పాలనలో ప్రాజెక్ట్ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆచార్య పంచెలకు దుష్యంత్ శ్రీధర్ ప్రచారం

సిటీబ్యూరో, మే 28 (నమస్తే తెలంగాణ): భారతీయ ఆధ్యాత్మిక వారసత్వాన్ని, సంస్కృతిని ప్రతిబింబించే ఆచార్య పంచకచం పంచెలకు ప్రచారకర్తగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త దుష్యంత్ శ్రీధర్ వ్యవహరించనున్నారు. ఆయన సహకారంతో సనాతన ధర్మం, భారతీయ సాంస్కృతిక వారసత్వానికి శాస్త్రీయ సొబగులను అద్దేందుకు ప్రచారకర్తగా నియమించారు. ఈ సందర్భంగా రామరాజ్ కాటన్ వ్యవస్థాపకులు కేఆర్ నాగరాజన్ మాట్లాడుతూ... రామరాజ్ కాటన్ అనేది పంచెలకు పర్యాయపదంగా మారింది. 4వేల రకాల పంచెల తయారీ, విక్రయాలను జరుపుతోందన్నారు. ఆధ్యాత్మిక గురువులు, ఆచార్యుల కోసం ప్రత్యేకంగా ఆచార్య పంచకచం పంచెలను రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రతిష్టాత్మక బ్రాండ్ అంబాసిడర్‌గా దుష్యంత్ శ్రీధర్‌ను నియమించుకోవడంతో ఆధునిక జీవనశైలికి భారతీయ వారసత్వ మూలాలను అనుసంధానం చేయడంలో భాగం అన్నారు. శ్రీరాముడి నుంచి ఎంతోమంది మహానుభావులైన ఆదిశంకరులు, రామానుజులు, వేదాంత దేశీకులు, మధ్వాచార్యులు, పూజ్య కంచి మహాపేరియావుల వరకు ఆచార్య పంచెలకు మార్గదర్శకులుగా నిలిచారని విద్వాంసులు దుష్యంత్ శ్రీధర్ పేర్కొన్నారు. అలాంటి ఎంతో ప్రముఖ్యత కలిగిన దుస్తులను నేటితరానికి అందించే గురుతర బాధ్యతగా భావిస్తున్నట్లుగా పేర్కొన్నారు.

మలబార్ గోల్డ్ రూ.150 కోట్ల విరాళం

చందానగర్‌లో ఉచిత ఆహార బండిని ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు

కొండాపూర్, మే 28: ప్రముఖ వ్యాపార సంస్థ, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ మాతృ సంస్థ మలబార్ గ్రూప్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా (సీఎస్ఆర్) హంగర్ ఫ్రీ వరల్డ్ కోసం రూ.150 కోట్లను కేటాయించింది. వరల్డ్ హంగర్ డేను పురస్కరించుకొని ప్రతిరోజు ఆకలితో ఉన్న పేదలకు ఆహారాన్ని అందించేందుకు 70 వేల మందికి నిత్యం ఆహారాన్ని అందజేస్తున్నారు. హంగర్ ఫ్రీ వరల్డ్ పథకం ప్రవేశపెట్టినప్పటి నుంచి గత మూడు సంవత్సరాల కాలంలో 2.5 కోట్ల మందికి ఆహారాన్ని అందజేసినట్లు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రతినిధులు తెలిపారు.

ఎన్ఐఎన్‌లో పీజీ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

సిటీబ్యూరో, మే 28 (నమస్తే తెలంగాణ): ఐసీఎంఆర్-జాతీయ పోషకాహార సంస్థ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఎమ్మెస్సీ అప్లయిడ్ న్యూట్రిషన్, ఎమ్మెస్సీ స్పోర్ట్స్ న్యూట్రిషన్ కోర్సులలో చేరేందుకు ఎన్-సెట్ షెడ్యూల్ విడుదల చేసింది. జూన్ 5న నిర్వహించే ఎంట్రన్స్ పరీక్ష ఉంటుంది.www.nin.res.in వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఎన్-సెట్ కోసం న్యూఢిల్లీ, ముంబై, కోల్‌కతా, హైదరాబాద్, బెంగళూరు, చెన్నయ్, విశాఖపట్నం వంటి నగరాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లుగా పేర్కొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

జలమండలి అధికారులతో మంత్రి పొన్నం సమీక్ష

సిటీబ్యూరో, మే 28 (నమస్తే తెలంగాణ): ముందస్తు వర్షాల దృష్ట్యా హైదరాబాద్ నగరంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఖైరతాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో బుధవారం వర్షాకాల ప్రణాళిక - 90 రోజుల కార్యచరణ, పురోగతిలో ఉన్న పలు ప్రాజెక్టు పనులపై జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో డైరెక్టర్లు మొదలుకుని క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అంతా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన శుద్ధిచేసిన నీటిని సరఫరా చేయడానికి శక్తివంచన లేకుండా పనిచేయాలని కోరారు. జలమండలి ఆర్థిక పరిస్థితిపై ఆరాతీసిన మంత్రి రెవెన్యూ పెంచుకోవడానికి, నీటి వృధాను అరికట్టడానికి, లీకేజీలను అరికట్టడానికి, ప్రజలలో నీటి వృధా తగ్గించేలా అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి, కోర్ సిటీ సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు, మేనేజర్లు, ట్రాన్స్‌మిషన్ అధికారులు పాల్గొన్నారు.

చేపమందు పంపిణీకి అన్ని ఏర్పాట్లు

నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జూన్8న జరిగే చేప ప్రసాదం పంపిణీ ఏర్పాట్లపై సచివాలయంలో మంగళవారం హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. బత్తిని సోదరులు పంపిణీ చేస్తున్న చేప ప్రసాదంపై ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందన్నారు. లక్షలాది మంది పాల్గొనే చేప ప్రసాదం పంపిణీకి పోలీసులు పకడ్బందీ భద్రతా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఈ సంవత్సరం చేప ప్రసాదం పంపిణీ కోసం 1.5 లక్షల చేప పిల్లలను ఏర్పాటు చేసినట్లు ఫిషరీస్ డిపార్ట్మెంట్ అధికారులు తెలిపారు. మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అడిషనల్ సీపీ విక్రమ్ సింగ్ మాన్, సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి, బత్తిని కుటుంబ సభ్యులు బత్తిని అమరనాథ్ గౌడ్ , గౌరీ శంకర్ , చంద్రశేఖర్ ,శివ శంకర్, సంతోష్, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి పొన్నం

గొప్ప సంఘ సంస్కర్త సురవరం

- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి
- ఘనంగా సురవరం ప్రతాపరెడ్డి జయంతి వేడుకలు

సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం నూతన లోగో ఆవిష్కరణలో అతిథులు

తెలుగు యూనివర్సిటీ, మే 28: తెలంగాణ ప్రజలలో సాంస్కృతిక చైతన్యాన్ని నింపిన సామాజిక సాహిత్యకారుడు, తెలంగాణా వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి అని తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జీ చిన్నారెడ్డి అన్నారు. నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం ఎన్‌టీఆర్ కళామందిరంలో బుధవారం సురవరం ప్రతాపరెడ్డి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వద్యాలయ అధికారిక చిహ్నాన్ని ఆవిష్కరించారు. సురవరం ప్రతాపరెడ్డి కుమారుడు కృష్ణవర్ధన్ రెడ్డిని ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. విస్తరణ సేవా విభాగం ఇన్‌చార్జి రామ్మూర్తి సభను సమన్వయం చేశారు. తెలుగు యూనివర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, ఉన్నత విద్యా మండలి అధ్యక్షుడు ఆచార్య వీ బాలకృష్ణారెడ్డి, ప్రముఖ రచయిత, చరిత్రకారులు డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు సురువరం

కవాడిగూడ, మే 28: సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో తెలంగాణను మేల్కొలిపి తెలుగు ప్రజలను జాగృతం చేసిన బహుముఖ ప్రజ్ఞానిధి సురవరం ప్రతాపరెడ్డి అని తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షులు, సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అన్నారు. సురవరం ప్రతాపరెడ్డి జయంతని పురస్కరించుకొని ట్యాంక్‌బండ్‌పై నున్న ఆయన విగ్రహం వద్ద ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ట్రస్ట్ కార్యదర్శి సురవరం పుష్పలత, తెలంగాణ సారస్వత పరిషత్తు కార్యదర్శి, ట్రస్ట్ సంయుక్త కార్యదర్శి జె.చెన్నయ్య, ట్రస్ట్ సభ్యులు, కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు డాక్టర్ సురవరం కృష్ణవర్ధన్‌రెడ్డి, కొండా లక్ష్మీ కాంత్‌రెడ్డి, సురవరం రఘువర్ధన్‌రెడ్డి, సురవరం విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ సురవరం రంగారెడ్డి, సురవరం అనిల్‌కుమార్‌రెడ్డి, సురవరం కపిల్ తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ వైతాళికుడు

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి అని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కొనియాడారు. బుధవారం సురవరం జయంతిని పురస్కరించుకుని సాహితీవేత్తలకు శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, పార్సీ, ఆంగ్ల భాషలలో నిష్ణాతులైన సురవరం ప్రతాపరెడ్డి గోల్కొండ పత్రికకు అనుబంధంగా భారతి సాహిత్య పత్రిక, ప్రజావాణి పత్రికలను స్థాపించి తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో ఒక అధ్యాయంగా నిలిచారని గుర్తు చేశారు. తెలుగు వర్సిటీకి అధికారికంగా సురవరంప్రతాపరెడ్డి పేరు పెట్టి సాహిత్యవేత్తలను గౌరవించుకున్నామని పేర్కొన్నారు..

బషీర్‌బాగ్ దేశోద్ధరక భవనంలో..

రవీంద్రభారతి,మే28: సురవరం ప్రతాపరెడ్డి జయంతిని పురస్కరించుకొని సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి సాహితీ పురస్కారం 2025 ప్రదానోత్సవ కార్యక్రమం బుధవారం సాయంత్రం బషీర్‌బాగ్ దేశోద్ధరక భవనంలో జరిగింది. శాంతా వసంతా ట్రస్ట్ సౌజన్యంతో సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ ఆధ్వర్యంలో సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి శ్రీధర్‌బాబు, విశిష్ట అతిథిగా శాంతా వసంతా ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ కేవ వరప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2025 సంవత్సరానికి గాను ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ హనుమాండ్ల భూమయ్య, రచయిత సంగిశెట్టి శ్రీనివాస్‌కు సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి సాహితీ పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, సురవరం పుష్పలత, ట్రస్టు సభ్యులు సురవరం కృష్ణవర్ధన్‌రెడ్డి, సురవరం రఘువర్ధన్‌రెడ్డి, సువరం విజయభాస్కర్‌రెడ్డి, సురవరం రంగారెడ్డి, సురవరం అనిల్‌కుమార్‌రెడ్డి, సురవరం కపిల్ తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి జాతీయ పేపర్ ఎక్స్‌పో



పేపర్ ఎక్స్‌పో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

అమీర్‌పేట్, మే 28: పేపర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేశంలో మొట్టమొదటి జాతీయ పేపర్ ఎక్స్‌పో జూన్ 6 నుంచి జూన్ 8వ తేదీ వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు పేపర్స్ ఎక్స్‌పో ఎల్ఎల్‌పీ సీఈఓ నిర్మల్ కుహాడ్ తెలిపారు. ఈ ఎక్స్‌పోకు సంబంధించిన వివరాలను బుధవారం బేగంపేట్‌లోని హోటల్ హరిత ప్లాజాలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. నిర్మల్ కుహాడ్ మాట్లాడుతూ.. పేపర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొదటి ఎక్స్‌పో ఇదేనని, దేశవ్యాప్తంగా కాగిత వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు ఈ రంగంలో చోటు చేసుకుంటున్న ఆధునిక పరిణామాలను ప్రదర్శించేందుకు ఈ ఎక్స్‌పో దోహదపడుతుందని తెలిపారు. 3 రోజుల పాటు జరగనున్న ఈ ఎక్స్‌పోలో పేపర్ పరిశ్రమలోని అన్ని విభాగాలు పాల్గొంటాయన్నారు. ఇది దేశంలో అతి పెద్ద, సమగ్ర పేపర్ పరిశ్రమ సమావేశంగా నిలవనుందని ఈ ఎక్స్‌పోలో 100కు పైగా జాతీయ అంతర్జాతీయ ప్రదర్శకులు పేపర్ తయారీ కన్వర్టింగ్, ముద్రణ, ప్యాకేజింగ్, రీసైక్లింగ్ రంగాలలో తాజా ఆవిష్కరణలు ఉత్పత్తులను ప్రదర్శించనున్నారని తెలిపారు. ఈ ఎక్స్‌పోకు దేశ నలుమూలల నుంచే కాకుండా ఆసియా, గల్ఫ్, సార్క్ దేశాల నుంచి దాదాపు పదివేల మందికి పైగా సందర్శకులు హాజరవుతారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంస్థ ప్రతినిధులు అరవింద్ శర్మ, బీఆర్‌రావు, మూల్ చంద్ పారేఖ్, దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్‌బీలో జాతీయ శిక్షణా కార్యక్రమం

బంజారాహిల్స్,మే 28: జాతీయ గణాంక, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖకు చెందిన నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్(ఎన్ఎస్ఓ) హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐబీఎం)లో మూడు రోజుల శిక్షణా కార్యక్రమం బుధవారం ప్రారంభమయింది. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో భాగంగా నేషనల్ హౌజ్ హోల్డ్ సర్వే, డొమెస్టిక్ టూరిజం ఎక్స్‌పెండేచర్ సర్వే, కన్‌స్ట్రక్షన్ సర్వే తదితర అంశాలపై సూచనలు జారీ చేశారు. ఆయా సర్వేలు కేంద్ర ప్రభుత్వ సంస్థలకు అవసరమయ్యే వివరాలను సేకరించడంతో పాటు భవిష్యత్తులో ప్రభుత్వ విధానాల రూపకల్పనలో దోహదపడుతాయన్నారు. అసంఘటిత రంగాల కార్మికుల స్థితిగతులు, పర్యాటక రంగం, రైల్వేశాఖకు సంబంధించిన సమగ్రమైన డేటాను సేకరించి అందజేసేందుకు వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్ గీతాసింగ్ రాథోడ్, ఏడీజీ సునీతా భాస్కర్, ఏడీజీ కిషోర్‌కుమార్, డీడీజీ అజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమేచ్యూర్ పికల్బాల్ అసోసియేషన్ ఎన్నిక

అసోసియేషన్ సభ్యులను సన్మానించిన అతిథులు

హైదరాబాద్, మే 28: అమేచ్యూర్ తెలంగాణా పికల్బాల్ అసోసియేషన్ వార్షిక సాధారణ సభ, ఎన్నికలు మంగళవవారం బేగంపేటలోని మారిగోల్డ్ హోటల్‌లో జరిగాయి. ఈ సమావేశం ద్వారా తెలంగాణ రాష్ట్రంలో పికల్బాల్ క్రీడా అభివృద్ధికి దృఢమైన అడుగులు పడ్డాయి. శ్రీ రమేష్ ఐపీఎస్.. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా డా.టీదశరథ రాంరెడ్డి (వర్కింగ్ ప్రెసిడెంట్), శ్రీమతి సుచరిత ఠాకూర్, డా.రాజారావు, ప్రధాన కార్యదర్శిగా శ్రీ జగన్మోహన్ గౌడ్, సహ కార్యదర్శులుగా శ్రీ కోము వెంకట్, శ్రీ పీ.బి. చక్రపాణి, ఖజానాదారుగా శ్రీ కలీమ్ అహ్మద్, నిర్వాహక సభ్యులుగా.. శ్రీ మారి సుధాకర్, శ్రీ కిరణ్ చారి, శ్రీమతి రాజని, శ్రీ ఎన్. చంద&ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ దశరథ రామ రెడ్డి తదితరులను ఎన్నుకున్నారు. కాగా ఈ కార్యవర్గం 2025-2029 కాలం వరకు పనిచేయనుంది.

నేడు పుస్తకావిష్కరణ

బంజారాహిల్స్, మే 28: దేశ స్వాతంత్ర్యం కోసం నిరంతరం పోరాడిన గిరిజనుల చరిత్రను క్రోడీకరిస్తూ రూపొందించిన 'గిరిజనులే తొలి స్వాతంత్ర్య సమరయోధులు' అనే పుస్తకాన్ని శుక్రవారం ఆవిష్కరించనున్నట్లు తెలంగాణ వనవాసీ కల్యాణ పరిషత్ రాష్ట్ర కమిటీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. నాదర్‌గుల్ అశోక్‌నగర్‌కాలనీలోని వైదేహీ కౌశలంలో నిర్వహించనున్న ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

విద్యుత్ నిబంధనలు పాటించాలి

సిటీబ్యూరో, మే 28(నమస్తే తెలంగాణ): తెలంగాణవ్యాప్తంగా గృహ సముదాయాల్లో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఉండడానికి ప్రభుత్వ పరంగా చేస్తున్న విద్యుత్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని హైదరాబాద్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్, తెలంగాణ ఎలక్ట్రికల్ బోర్డు లైసెన్సింగ్ కార్యదర్శి టి.కాంతారావు ఒక ప్రకటనలో తెలిపారు.విద్యుత్ సరఫరా కంటే ముందే కాంట్రాక్టర్ సంతకంతో పాటు స్వీయ ధృవీకరణ పత్రాన్ని విద్యుత్ సంస్థకు గృహయజమాని సమర్పించాలని, ప్రభుత్వం సర్టిఫై చేసిన ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లతోనే పనులు చేయించుకోవాలని సూచించారు.

ప్రొటోకాల్ పాటించరా..!

- వాడివేడిగా అర్చక ఉద్యోగ సంక్షేమ బోర్డు సమావేశం
- ఉద్యోగుల సంక్షేమానికి పలు తీర్మానాల ఆమోదం

తీర్మాన పత్రాలను నవీన్ మిట్టల్ చేతులమీదుగా తీసుకుంటున్న సభ్యులు

సిటీబ్యూరో, మే 28(నమస్తే తెలంగాణ): అసలు తాము సభ్యులం ఉన్నామని గుర్తించే వారే దేవాదాయశాఖలో లేరని, సమావేశాలకు సంబంధించి ప్రొటోకాల్ పాటించడం లేదంటూ అర్చక సంక్షేమబోర్డు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సెక్రటేరియేట్‌లో తెలంగాణ అర్చక ఉద్యోగ సంక్షేమ ట్రస్ట్ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రెవెన్యూ సెక్రటరీ, అర్చక వెల్ఫేర్ బోర్డు చైర్మన్ నవీన్ మిట్టల్, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజరామయ్యర్, రిటైర్డ్ జడ్జ్ వామన్‌రావు, దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు, ఏడీసీ శ్రీనివాసరావు, సభ్యులు కాండూరు కృష్ణమాచార్యులు, చిలకమర్రి శ్రవణ్‌కుమారాచార్యులు, జక్కాపురం నారాయణ స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత సంవత్సరం నుంచి ట్రస్ట్ ద్వారా జరిగిన లావాదేవీలు, అర్చక ఉద్యోగ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ఖర్చు చేసిన నిధులు, వెల్ఫేర్ ఫండ్ నుంచి ఈసారి చేయాల్సిన పనులపై చర్చ జరిగింది. ఇందులో అర్చక ఉద్యోగులకుఅందించాల్సిన సంక్షేమం విషయంలో అధికారుల నిర్లక్ష్యంపై సభ్యులు అధికారుల ముందే దేవాదాయశాఖ ఏడీసీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఇటీవలే బాధ్యతలు తీసుకున్నానని, గతంలో జరిగిన తప్పులను పట్టించుకోవద్దని ఏడీసీ చెప్పడంతో సభ్యులు మరింత ఆగ్రహానికి గురయ్యారు. ఒకదశలో దేవాదాయశాఖ ప్రధాన అధికారి కూడా తనకు సభ్యులెవ